క్లుప్తంగా

వైభవంగా గణపతి ఏకాహం

అంబాజీపేట: మాచవరంలో వేంచేసిన యువ గణపతి ఆలయ ప్రాంగణంలో ఏకాహం బుధవారం వైభవంగా జరిగింది. ఆలయ అర్చకులు కొడమంచలి నాగేశ్వరరావు, కొడమంచలి ఫణికుమార్‌ల ఆధ్వర్యంలో దాసరి శ్రీనివాసరావు, ఆదిలక్ష్మి దంపతులు స్వామి వారికి కలశస్థాపన పూజ నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ఏకాహం ఏర్పాటు చేశారు. గురువారం అన్నసమారాధన చేపట్టనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

కిడ్నీ బాధితుడికి ఆర్థిక సాయం



అయ్యప్పకు సాయం అందిస్తున్న వీరన్న కుటుంబ సభ్యులు

మలికిపురం: మండలంలోని బట్టేలంకకు చెందిన దివంగత బోనం వీరన్న-కాంతమ్మ కుటుంబ సభ్యులు సమకూర్చిన రూ.35 వేలను రామరాజులంకకు చెందిన కిడ్నీ బాధితుడైన యువకుడు దేశినేడి అయ్యప్పకు ఆర్థిక సాయంగా అందించారు. కార్యక్రమంలో వీరన్న కుటుంబ సభ్యులతో పాటు పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు. అనంతరం గ్రామస్తులు మాట్లాడుతూ అయ్యప్పకు త్వరలో అతడి తల్లి కిడ్నీ దానంతో మార్పిడి చేయాల్సి ఉందని, దానికి రూ.10 లక్షలు ఖర్చు కానుందని దాతలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

భారీ అన్నసమారాధన



మడికిలోని అంతర్రాష్ట్ర కూరగాయల మార్కెట్‌లో నిర్వహిస్తున్న భారీ అన్నసమారాధన

ఆలమూరు: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని వివిధ ప్రదేశాల్లో బుధవారం భారీ అన్నసమారాధనలు జరిగాయి. మడికిలోని భక్తాంజనేయ అంతర్రాష్ట్ర కూరగాయల మార్కెట్‌లో ఏటా మాదిరిగానే ఈ ఏడాది సుమారు 18 వేల మందికి అన్నసమారాధన నిర్వహించారు. అలాగే జొన్నాడ ఆలయ ప్రాంగణంలో రావులపాలేనికి చెందిన డొక్కా సీతమ్మ సేవాసమితి ఆధ్వర్యంలో సుమారు ఐదు వేల మందికి భారీ అన్నసమారాధన జరిగింది. అలాగే వివిధ గ్రామాల్లోని పలు ఆలయాల వద్ద భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. మార్కెట్ కమిటీ అధ్యక్షుడు పాలూరి సత్తిబాబు, దొండపాటి సుబ్బరాజు, చెల్లుబోయిన సింహాచలం, డొక్కా సీతమ్మ సేవాసమితి ప్రతినిధులు పిల్లా శ్రీదేవి, వల్లెం రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

తమలపాకులతో శివలింగం



కడలిలో ఏర్పాటు చేసిన తమలపాకుల శివలింగం

రాజోలు: శివరాత్రి పురస్కరించుకుని కడలి గ్రామంలోని గుబ్బల వారి పాలెంలో ఏర్పాటు చేసిన తమలపాకుల శివలింగం భక్తులను ఆకట్టుకుంది. తమలపాకులతో తయారు చేసిన శివలింగాన్ని భక్తులు దర్శించుకుని పూజలు చేశారు.

'ఛావా' చిత్రం చరిత్రకు నిదర్శనం

అమలాపురం టౌన్: 'ఛావా' చిత్రం నిజమైన చరిత్రకు నిదర్శనంగా నిలుస్తుందని భజరంగ్ దళ్ రాష్ట్ర సహాయ ప్రముఖ్ శిరంగు నాయుడు అన్నారు. అమలాపురంలో ఆ చిత్రం ప్రదర్శితమవుతున్న శేఖర్ థియేటర్ వద్ద విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ), భజరంగ్ దళ్ ప్రతినిధులు బుధవారం చిత్రాన్ని వీక్షించారు. అనంతరం థియేటర్ బయట 'ఛావా' చరిత్ర గురించి మాట్లాడారు. అలనాడు ప్రభుత్వ పెద్దలు వాస్తవాలను దాచిపెట్టి భారతీయులను పిరికివారిగా, విదేశీ మొఘల్ రాజులు గొప్ప వ్యక్తులుగా చూపించారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఛత్రపతి శివాజీ మహారాజ్, సంభాజీ మహారాజ్‌లను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని వీహెచ్‌పీ, భజరంగ్ దళ్ ప్రతినిధులు సూచించారు. థియేటర్ వద్ద జై సంభాజీ మహారాజ్, జై శివాజీ మహారాజ్, భారతమాతకు జై అంటూ నినాదాలు చేశారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

ముమ్మిడివరం: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఓ మహిళ బుధవారం మృతి చెందింది. ముమ్మిడివరం మండలం అనాతవరం కైరం వారి వీధికి చెందిన పేరూరి మహాలక్ష్మి (32) తన తోటికోడలితో కలసి గత ఆదివారం కొమరగిరి శుభకార్యానికి వెళ్లి తిరిగి వస్తుంది. ఈ క్రమంలో అనాతవరంలో రోడ్డు దాటుతుండగా అటుగా వెళుతున్న ఇద్దరు మెడికల్ విద్యార్థినులు స్కూటీతో ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో మహాలక్ష్మి తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. గాయపడిన ఆమెను అమలాపురం కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. ముమ్మిడివరం ఎస్సై జ్వాలాసాగర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మోరి శివాలయం వద్ద క్యూ లో వెళుతున్న భక్తులు



ముక్తేశ్వరంలో క్షణముక్తేశ్వరునికి విశేష పూజలు చేస్తున్న ఆలయ అర్చకులు



ముక్తేశ్వరం వృద్ధగౌతమి పాయ వద్ద మూసివాయనాలు సమర్పిస్తున్న భక్తులు



ఊబలంకలో పూర్ణాలంకరణలో స్వామి, అమ్మవార్లు

హర హర మహాదేవ

- ఘనంగా మహాశివరాత్రి ఉత్సవాలు
- కిటకిటలాడిన శైవక్షేత్రాలు

సఖినేటిపల్లి: మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని బుధవారం మండలంలో శైవక్షేత్రాలు వేకువ జామున నుంచి భక్తులతో పోటెత్తాయి. హర హర మహాదేవ శంభోశంకర అన్న భక్తుల నినాదాలతో ఆలయాలు మార్మోగాయి. మోరి, గుడిమూల, అంతర్వేది ఆలయాల్లో వేకువజాము నుంచి భక్తులు పోటెత్తారు. వీటితో పాటు టేకిశెట్టిపాలెం, అప్పనరామునిలంక, సఖినేటిపల్లి, అంతర్వేదికర, అంతర్వేదిపాలెం, సఖినేటిపల్లిలంక, గ్రామాల్లోని శివాలయాల్లో భక్తులు స్వామివారికి పూజలు చేశారు.

మలికిపురంలో..

మలికిపురం: మండలంలో బుధవారం మహాశివరాత్రి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. కేశనపల్లి, తూర్పుపాలెం, లక్కవరం, మలికిపురం, రామరాజులంక, విశ్వేశ్వరాయపురం, చింతలమోరి, బట్టేలంక, గూడపల్లి, మట్టపర్రు, గుడిమెళ్లంక, మేడిచర్లపాలెం తదితర గ్రామాల్లో శివాలయాలు ఉదయం నుంచీ భక్తులతో కిటకిటలాడాయి. సాయంత్రం భక్తిశ్రద్ధలతో దీపాలంకరణలు నిర్వహించారు.

పలివెలలో..

కొత్తపేట: పలివెల ఉమా కొప్పేశ్వర స్వామివారి క్షేత్రానికి జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు పోటెత్తారు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా బుధవారం తెల్లవారుజాము నుంచి వివిధ ప్రాంతాల నుంచి అత్యధిక సంఖ్యలో భక్తులు పలివెల బాట పట్టారు. జాయింట్ కలెక్టర్, ఆర్డీవో పి.శ్రీకర్, ఎంపీపీ మార్గన గంగాధరరావు, రావులపాలెం సీఐ సీహెచ్ విద్యాసాగర్, పలువురు ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, అత్యధిక సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

భక్తులకు దాతల అల్పాహారం

స్థానిక రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు తోట వెంకటేశ్వరరావు, కాంతిభారతి విద్యాసంస్థల కరస్పాండెంట్ తోట సత్యవాణి దంపతుల ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదం, అల్పాహారం, వాటర్ ప్యాకెట్లు సమకూర్చారు. అలాగే పలివెల ధర్మసత్రం ద్వారా సత్రం కమిటీ చైర్మన్ చప్పిడి సాయిబాబు, ఈఓ కృష్ణచైతన్య ఆధ్వర్యంలో ఉదయం 11 గంటల నుంచి సుమారు 6 వేల మంది భక్తులకు భోజన సదుపాయం కల్పించారు. పలివెల ఉమా కొప్పేశ్వర స్వామి వారి క్షేత్రం మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రధాన ఘట్టమైన స్వామి, అమ్మవార్ల రథోత్సవం అత్యంత వైభవంగా సాగింది. ఎమ్మెల్యే బండారు సత్యానందరావు కొబ్బరికాయ కొట్టి రథోత్సవాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే వెంట రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం, వెలమ కార్పొరేషన్ చైర్మన్ గణేష్‌కుమార్, మాజీ సర్పంచ్ చవల జగన్నాథం, దేవస్థానం మాజీ చైర్మన్ గొలకోటి శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.



పలివెలలో ఉమా కొప్పేశ్వరుల రథోత్సవాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

అంబాజీపేటలో..

అంబాజీపేట: మండలంలోని శివాలయాలల్లో మహాశివరాత్రి మహోత్సవాలను వైభవంగా శివనామస్మరణాలతో బుధవారం నిర్వహించారు. పుల్లేటికుర్రు, వ్యాఘ్రేశ్వరం, మాచవరం, గంగలకుర్రు అగ్రహారం, కోశివారి అగ్రహారం ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలో వీరన్నబాబు సంబరాలను ఘనంగా నిర్వహించారు.

పి.గన్నవరంలో..

పి.గన్నవరం: మహాశివరాత్రి పర్వదినాన్ని మండలంలో భక్తులు బుధవారం భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. తెల్లవారు జాము నుంచి శివాలయాలకు వెళ్లి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. దీంతో మండలంలోని శివాలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. పి.గన్నవరంలోని గరుడేశ్వరాలయంలో అర్చక స్వామి భైరవభొట్ల సత్యవెంకట నారాయణమూర్తి ఆధ్వర్యంలో తెల్లవారుజాము నుంచి అభిషేకాలు జరిగాయి. వేలాది మంది భక్తులు స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. రాత్రి లింగోద్భవ కాలంలో మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. అలాగే బెల్లంపూడి, మొండెపులంక, మానేపల్లి తదితర గ్రామాల్లో శివాలయాలకు భక్తులు పోటెత్తారు.

రావులపాలెంలో..

రావులపాలెం: మండలంలోని పలు గ్రామాల్లో మహాశివరాత్రి పూజలు బుధవారం ఘనంగా జరిగాయి. రావులపాలెం, ఊబలంక, లక్ష్మీపోలవరం, ఈతకోట తదితర గ్రామాల్లోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శివపార్వతుల కల్యాణాన్ని తిలకించారు. ఊబలంకలో సర్వమంగళ సమేత ఉమామహేశ్వర స్వామి ఆలయంలో వేద పండితుల ఆధ్వర్యంలో అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆలమూరులో..

ఆలమూరు: మండలంలోని శైవక్షేత్రాలన్నీ బుధవారం శివ నామస్మరణతో మార్మోగాయి. ఆలమూరు, పెనికేరు ఆలయాలకు భక్తుల తాకిడి విపరీతంగా పెరిగింది. ఈ రెండు దేవాలయాకు వేల సంవత్సరాల చరిత్ర ఉండటంతో జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామి వారిని దర్శించుకున్నారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని వివిధ గ్రామాల్లోని ఆలయాల వద్ద నిర్వహించిన ఏకాహాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

అయినవిల్లిలో..

అయినవిల్లి: మండలంలోని ప్రముఖ శివాలయాలు భక్తులతో పోటెత్తాయి. ముక్తేశ్వరం ముక్తికాంత సమేత క్షణముక్తేశ్వరస్వామి ఆలయం వద్ద వేకువజాము నుంచి స్వామి దర్శనార్థం భక్తులు పోటెత్తారు. అయినవిల్లి, వీరవల్లిపాలెం, సిరిపల్లి, విలస, తొత్తరమూడి, మాగాం, నేదునూరు, వెలువలపల్లి, శానపల్లిలంక, మడుపల్లి ఆలయాలు భక్తులతో కిక్కిరిశాయి. స్వామి వార్లకు లింగోద్భవ కాలం వరకూ విశేష అభిషేకాలు, పూజలు నిర్వహించారు. స్వామిని వివిధ పుష్పాలతో అలంకరించారు. సాయంత్రం దీపోత్సవం నిర్వహించారు. ముక్తేశ్వరం వృద్ధగౌతమి స్నాన ఘాట్ వద్ద భక్తులు అధిక సంఖ్యలో స్నానాలు ఆచరించారు. పిండ ప్రదానాలు, మూసివాయనాలు సమర్పించారు. ఇందుకు తగ్గట్టు అధికారులు ఏర్పాట్లు చేశారు. క్షణముక్తేశ్వరునికి, అయినవిల్లి విఘ్నేశ్వరస్వామిని పి.గన్నవరం వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు తదితరులు దర్శించుకున్నారు.



జి.అగ్రహారంలో కొలువుదీరిన వీరేశ్వరస్వామి

శివనామ స్మరణతో మార్మోగిన ఆలయాలు

మామిడికుదురు: మహాశివరాత్రిని పురస్కరించుకుని మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం ఏర్పాటు చేసిన భారీ సెట్టింగులు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అప్పనపల్లి మైనర్‌రాజుగారి వీధిలో బాల గణపతి మిత్ర బృందం ఆధ్వర్యంలో 10,116 జ్యోతులతో ఏర్పాటు చేసిన ప్రత్యేక దీపాలంకరణ, భారీ సెట్టింగులతో పాటు అదే గ్రామంలోని సంతపేటలో జై గౌరీ శంకర భక్త బృందం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దీపాలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. పెదపట్నం ఆలయం వద్ద ఏర్పాటు చేసిన ప్రభలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అప్పనపల్లి కనక మహాలక్ష్మమ్మ, సాయి వీరభద్రస్వామి ఆలయాలు, పలుర గ్రామాల్లోని ఆలయాల వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక దీపాలంకరణలు భక్తుల్ని పరవశింప చేశాయి. పాశర్లపూడి సంతపేట ఆలయం వద్ద తోలేటి ఆదినారాయణమూర్తి, నాగరామలక్ష్మి ఆధ్వర్యంలో శ్రీవీరభద్రస్వామి సంబరం, ప్రభ ఉత్సవం, శూలాల సంబరం ఘనంగా జరిగాయి.



అప్పనపల్లిలో పుష్పాలతో తయారు చేసిన శివలింగం



అప్పనపల్లిలో థర్మకోల్‌తో తయారు చేసిన అయోధ్య రామాలయం



అప్పనపల్లిలో ఆకట్టుకున్న దీపాలంకరణ



అప్పనపల్లిలో ఏర్పాటు చేసిన వేంకటేశ్వరస్వామి విగ్రహ నమూనా



జొన్నాడలో అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి

వీరభద్రస్వామి రథోత్సవం



మొగలికుదురులో నిర్వహించిన వీరభద్రస్వామి రథోత్సవం



మోరిలో రథయాత్ర

మామిడికుదురు: మహా శివరాత్రిని పురస్కరించుకుని మొగలికుదురులో భద్రకాళీ సమేత వీరభద్రస్వామి రథోత్సవం బుధవారం కన్నులపండువలా జరిగింది. మేళ తాళాలు, బాణసంచా కాల్పులు, భక్తుల కోలాహలం నడుమ ఈ రథోత్సవం ఆద్యంతం కన్నుల పండువగా జరిపించారు. హర హరా అంటూ భక్తులు స్వామి వారి రథాన్ని లాగారు. భారీ సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మ వార్లను దర్శించుకుని ముడుపులు, మొక్కులు సమర్పించారు.

సఖినేటిపల్లిలో..

సఖినేటిపల్లి: మహాశివరాత్రి మహోత్సవాల్లో భాగంగా బుధవారం మోరి, గుడిమూల గ్రామాల్లో దేవస్థానం కమిటీలు ఘనంగా రథోత్సవాలు నిర్వహించాయి. గుడిమూలలో దేవస్థానం చైర్మన్ రుద్రరాజు రాము, మోరిలో దేవస్థానం చైర్మన్ జాన సునీల్ ఆధ్వర్యంలో రథయాత్రలు జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సత్సంగంతో ఆనందమయ జీవితం



కొత్తపేటలో ఈశ్వరీయ విద్యాలయం మందిరం వద్ద జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డాక్టర్ శేషుబాబు దంపతులు

కొత్తపేట: సమాజంలో ప్రతి వ్యక్తి సత్సంగం ద్వారా తమ జీవితాన్ని ఆనందమయం చేసుకోవాలని స్థానిక ప్రముఖ వైద్యుడు కాశిన గేయానంద శేషుబాబు, ప్రముఖ అంతర్జాతీయ శిల్పి డి.రాజ్‌కుమార్ వుడయార్ అన్నారు. ప్రజాపిత బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వ విద్యాలయం కొత్తపేట శాఖ ఆధ్వర్యంలో శివరాత్రి వేడుకలు ఘనంగా ప్రారంభించారు. ఆ ప్రాంగణాన్ని విశేషంగా అలంకరించారు. బ్రహ్మకుమారి మందిరం ప్రాంగణంలో ప్రత్యేక వేదికను ఏర్పాటు చేసి శివలింగాన్ని నెలకొల్పారు. ఆ నందన వనంలో శ్రీకృష్ణుడు విగ్రహం, ఆవు దూడ తదితర విగ్రహాలను అలంకరించి, కొత్త అందాలను తీసుకువచ్చారు. ఉత్సవాల్లో భాగంగా బుధవారం శివరాత్రి పర్వదినం పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమంలో డాక్టర్ శేషుబాబు దంపతులు, శిల్పి రాజ్‌కుమార్ ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాలను ప్రారంభించారు. వారు మాట్లాడుతూ మంచి ఆలోచనలతో, మంచి వ్యక్తులతో, మంచి పనులతో స్నేహం చేయడమే సత్సంగం అని బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం సూచనను ప్రతీ ఒక్కరూ పాటించాలన్నారు. అనంతరం భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు.

'యర్రంశెట్టి'కి అరుదైన గౌరవం



డాక్టర్ యర్రంశెట్టి సత్యప్రసాద్

మామిడికుదురు: అంతర్జాతీయ సైంటిఫిక్ రీసెర్చ్ ఇన్ ఇంజినీరింగ్ మేనేజ్‌మెంట్ జర్నల్‌లో మామిడికుదురు డిగ్రీ కళాశాల ఫిజిక్స్, ఎలక్ట్రానిక్స్ విభాగాధిపతి డాక్టర్ యర్రంశెట్టి విజయ్‌సత్యప్రసాద్ సమర్పించిన 'ద రిలేషన్ బిట్వీన్ ఆర్మ్ ప్రాసెసర్ అండ్ నానో ఎలక్ట్రానిక్స్ ఇన్ మోడరన్ కంప్యూటింగ్' పరిశోధన పత్రం బుధవారం ప్రచురితమైంది. సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని బెంగళూరుకు చెందిన అంతర్జాతీయ జర్నల్‌లో ఆయన వ్యాసానికి చోటు లభించింది. ఆ జర్నల్‌కు సత్యప్రసాద్ ముఖ్య సంపాదకుడిగా వ్యవహరించారు. న్యూయార్క్ కార్నల్ విశ్వవిద్యాలయ ఎలక్ట్రికల్ ఆచార్యుడు ఖుర్రం ఖాన్ అఫ్రిది ఈ విషయం తెలిపారని సత్యప్రసాద్ తెలిపారు. ఆ పరిశోధనా వ్యాసం ప్రచురితమైన ప్రతులను, ప్రచురిత ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. ప్రస్తుతం నడుస్తున్న అత్యాధునిక కంప్యూటర్స్, భవిష్యత్తులో నూతన మొబైల్ సాంకేతికలో ఉపయోగించే ఎలక్ట్రానిక్ విభాగం ఆర్మ్ ప్రాసెసర్లలో మైక్రో, నానో ఎలక్ట్రానిక్స్ వస్తువుల పాత్రపై డాక్టర్ యర్రంశెట్టి రూపొందించిన పరిశోధనా వ్యాసం జర్నల్‌లో ఆకట్టుకుందని సంపాదకీయం సభ్యులు పేర్కొన్నారు. సత్యప్రసాద్‌ను దీప్తి విద్యా సంస్థల చైర్మన్ డీవీవీ సత్యనారాయణ, అధ్యాపకులు మోకా రంగారావు తదితరులు అభినందించారు.

ఘనంగా వీరన్నబాబు సంబరం

పి.గన్నవరం: వీరన్నబాబు బోణాల సంబరాన్ని బుధవారం పి.గన్నవరంలో ముత్యాల దుర్గాప్రసాద్, ఇంద్రకుమారి దంపతుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జంగమదేవర వీరకుమారులతో బాణసంచా కాల్పుతూ మంగళ వాయిద్యాలతో గ్రామోత్సవం నిర్వహించారు. తాటమ్మతల్లి, గరుడేశ్వర స్వామి వారి ఆలయాల్లో పూజలు చేశారు. అనంతరం దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో భక్తులకు అన్న సమారాధన నిర్వహించారు. కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ పోలింగ్‌కు నాలుగు కేంద్రాల ఏర్పాటు



మామిడికుదురు పోలింగ్ కేంద్రంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న తహసీల్దార్ ఆచార్యులు

మామిడికుదురు: ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ పోలింగ్ నిర్వహణకు మామిడికుదురు మండలంలో నాలుగు కేంద్రాలు ఏర్పాటు చేశామని ఎమ్మార్వో వైవీ సుబ్రహ్మణ్యం ఆచార్యులు తెలిపారు. ఆయన బుధవారం మండలంలో పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఆయా కేంద్రాల్లో పోలింగ్ నిర్వహణకు చేపట్టిన ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. మామిడికుదురు జెడ్పీ ఉన్నత పాఠశాలలో రెండు కేంద్రాలతో పాటు మండల రెవెన్యూ కార్యాలయం, మండల పరిషత్ కార్యాలయాల్లో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. మండల పరిధిలో మొత్తం 2,906 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లు ఉన్నారని తెలిపారు. పోలింగ్ ప్రశాంతంగా జరిగేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ప్రశాంత వాతావరణంలో పోలింగ్ నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన కోరారు.

అంబాజీపేటలో..

అంబాజీపేట: ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో పోలింగ్ కేంద్రాలను సర్వం సిద్ధం చేశామని తహసీల్దార్ జె.వెంకటేశ్వరి తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగిన భద్రతను ఏర్పాటు చేశామన్నారు.


ఆలమూరులో..

ఆలమూరు: గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు ఆలమూరు సర్వం సిద్ధమైంది. మండలంలో గురువారం ఏర్పాటు చేయనున్న మూడు ఎన్నికల బూత్‌లో 1960 ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. బూత్ నంబరు 83లోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో 804 మంది, బూత్ నంబరు 84లోని స్త్రీశక్తి భవనంతో 568 మంది, బూత్ నంబరు 85లోని మండల విద్యాశాఖ కార్యాలయంలో 588 మంది ఓటు వేయనున్నారు.

అయినవిల్లిలో..

అయినవిల్లి: పట్టభద్రుల ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. అయినవిల్లి మండలంలోని పట్టభద్రుల ఎన్నికల నేపథ్యంలో స్థానిక మండల పరిషత్ కార్యాలయం, తొత్తరమూడి గ్రామంలో ఏర్పాటు చేసి 197, 198, 199 ఎమ్మెల్సీ పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేశారు. అయినవిల్లి మండలంలో మొత్తం 2514 మంది ఓటర్లు ఉన్నాయి. వీరిలో 1463 మంది పురుషులు, 1051 మంది స్త్రీలు ఉన్నారు. పట్టభద్రులు ఓటు హక్కు వినియోగించుకునేందుకు వీలుగా అన్ని ఏర్పాట్లను అధికారులు చేశారు. అయినవిల్లి ఎస్సై కె.మనోహర్‌జోషి పోలింగ్ కేంద్రాల పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

టైలర్స్ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా రమణారావు



వెంకట రమణారావు (ఫైల్)

రాజోలు: ఏపీ టైలర్స్ కోఆపరేటివ్ సొసైటీ పరిరక్షణ కమిటీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా రాజోలు పట్టణానికి చెందిన టైలర్ కడలి వెంకట రమణారావు ఎన్నికయ్యారు. బుధవారం ఈ మేరకు కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు పోగుల మలికార్జునరావు నుంచి ఉత్తర్వులు వచ్చినట్టు రమణారావు మీడియాకు చెప్పారు. గతంలో రమణారావు రాజోలు పట్టణ టైలర్ సంఘ అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించారు. రాష్ట్ర కమిటీలో రమణారావుకు చోటు కల్పించడంపై రాజోలు సంఘ అధ్యక్షుడు గుబ్బల నరసింహస్వామి, కార్యదర్శి మామిడిశెట్టి సత్యనారాయణ, సంఘ నాయకులు పి.సత్యనారాయణ, ఎం.త్రినాథరావు, కె.సత్యనారాయణ, సీహెచ్ హరికృష్ణ, కొండా సత్యనారాయణ హర్షం వ్యక్తం చేశారు. కాగా తన నియామకానికి సహకరించిన రాజోలు టైలర్స్ సంఘ సభ్యులకు, రాష్ట్ర అధ్యక్షుడు మల్లికార్జునరావు, ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యంలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్ర వెటర్నరీ సంఘ ఉపాధ్యక్షురాలిగా అనిత

ఆలమూరు: రాష్ట్ర పశుసంవర్ధక శాఖ అధికారుల సర్వీస్ అసోసియేషన్ ఉపాధ్యక్షురాలిగా ఆలమూరుకు పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకురాలు ఏడీఏ ఎల్.అనిత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. విజయవాడ లబ్బీపేటలోని ఎన్టీఆర్ వెటర్నరీ సూపర్ స్పెషాల్టీ ఆసుపత్రి ఆవరణలో రాష్ట్ర యానిమల్ హస్బెండరీ ఆఫీసర్స్ సర్వీస్ అసోసియేషన్ (ఏపీఏహెచ్‌ఓఎస్ఎ) జరిగిన నూతన కార్యవర్గం సమావేశంలో ఈ ఏకగ్రీవ ఎన్నిక జరిగింది. ఏడీఈ అనితను బుధవారం ఆమె నివాసంలో పలువురు పశుసంవర్ధకశాఖ అధికారులు, సిబ్బందితో పాటు ప్రజా ప్రతినిధులు అభినందనలు తెలియజేశారు.



ఏడీఏ అనితను అభినందిస్తున్న అధికారులు, సిబ్బంది